సాక్షి
పల్నాడు
మంగళవారం । 4 । ఏప్రిల్ । 2023



అమ్మవారికి తిరుమంజన సేవ

తాడేపల్లి రూరల్: విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై అష్టలక్ష్ముల ప్రతిష్ఠా వార్షికోత్సవాలు సోమవారం మూడో రోజుకు చేరాయి. అమ్మవార్లకు తిరుమంజన సేవ నిర్వహించారు.



దుర్గమ్మ సేవలో మంత్రి అంబటి

ఇంద్రకీలాద్రి: బెజవాడ దుర్గమ్మను మంత్రి అంబటి రాంబాబు సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ కె.రాంబాబు, ఈఓ భ్రమరాంబ స్వాగతం పలికారు.

కరోనా జీరో

గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా సోమవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించ లేదు.



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళ)	సహర్ (బుధ)
నరసరావుపేట	6:28	4:42
గుంటూరు	6:26	4:43
బాపట్ల	6:26	4:43

న్యూస్‌రీల్

నేటి నుంచి ఒంటి పూట అంగన్‌వాడీ బడులు

నెహ్రూనగర్: అంగన్‌వాడీ కేంద్రాలు మంగళవారం నుంచి ఒంటి పూట పనిచేయనున్నాయి. ఉదయం 8 గంటలకు అంగన్‌వాడీ కేంద్రాలు ప్రారంభమై మధ్యాహ్నం 12 గంటలకు వరకు పనిచేస్తాయని జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి బి.మనోరంజని సోమవారం తెలిపారు. మే 31వ తేదీ వరకు అమలులో ఉంటుందని చెప్పారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం




ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి బాపట్ల జిల్లాకు చెందిన భక్తులు రూ.లక్ష విరాళాన్ని సమర్పించారు. బాపట్ల జిల్లా ఖాజీపాలెంనకు చెందిన మంతెన సుబ్బరాజు, సత్యవతి దంపతులు అమ్మవారిని దర్శించుకునేందుకు సోమవారం ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం అందజేశారు. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. పాలక మండలి సభ్యురాలు బచ్చు మాధవీకృష్ణ పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు సమన్వయంతో పనిచేయండి

నరసరావుపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఫ్యామిలీ ఫిజిషియన్' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని ఎస్సార్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో రెవెన్యూ డివిజన్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, మండల అధికారులతో ముఖ్యమంత్రి పర్యటనపై ఆదివారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల ఆరో తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిలకలూరిపేట లింగంగుంట నుంచి లాంఛనంగా ప్రారంభించనున్నట్లు చెప్పారు. సామాన్య ప్రజానీకానికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలని కోరారు. ఏఎన్‌ఎంలు అందరూ ముఖ్యమంత్రి కార్యక్రమానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అవసరమైన మజ్జిగ ప్యాకెట్లు, మంచినీరు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా పార్కింగ్ సమస్య ఎదురు కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్, డీఆర్వో కె.వినాయకం పాల్గొన్నారు.

మిర్చి యార్డుకు 1,33,572 బస్తాల రాక



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,33,572 మిర్చి బస్తాలు వచ్చాయి. గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,26,058 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,200 నుంచి రూ.25,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.27,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 90,338 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

దిగ్విజయం తొలి వసంతం

పల్నాడు అంటే రాళ్లురప్పలు.. అభివృద్ధికి.. అక్షరాస్యతకు దూరం.. ఫ్యాక్షన్‌కు చిరునామాగా భావించేవారు.. ఆరోజుల్లో .. ఓ కృష్ణా ఓ క్రిష్ణవేణీ.. నా జీవధాత్రి.. ఎగువ పలనాటి జొన్న పొలాలను.. తడపకుండానే నాపరాయినేలలు దాటి.. శతసహస్ర సంవత్సరాల తరువాత కూడా.. నిర్దయగా నేటికి నువ్వు పల్లానికి ప్రవహించి పోతావు.. అంటూ ఓ కవి ఆవేదన భరితుడయ్యాడు.. రోజులు మారాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే పరిపాలన సౌలభ్యం కోసం జిల్లాలు ఏర్పాటు చేశారు. పల్నాడు జిల్లా ఏర్పాటుతో పాటు అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. వ్యవసాయ రంగానికి తగిన ప్రాధాన్యం ఇచ్చారు. సాగునీటికి చింత లేదు. వైద్యానికి చేరువ లక్ష్యంతో మెడికల్ కళాశాల కేటాయించారు. దీంతో పల్నాడు అభివృద్ధిలో పరుగులు పెడుతోంది. కొత్తగా జిల్లా ఏర్పడి ఏడాది పూర్తి అయిన సందర్భంగా కథనం..



నరసరావుపేట మండలం కాకాని వద్ద నిర్మాణంలో ఉన్న జేఎన్‌టీయూ కళాశాల సముదాయం

ప్రగతి పథంలో దూకుడు

- పల్నాడు జిల్లా ఏర్పాటుతో సమస్యలకు చెక్
- మూడు రెవెన్యూ డివిజన్లతో చేరువైన పాలన
- ప్రజలకు అందుబాటులో జిల్లా అధికారులు
- తొలి ఏడాది ఎంతో సంతృప్తినిచ్చింది: కలెక్టర్ శివశంకర్ లోతేటి

సాక్షి, నరసరావుపేట: దశాబ్దాల నుంచి ఈ ప్రాంత ప్రజల కోరికను నెరవేరుస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొత్త జిల్లాలలో భాగంగా పల్నాడు జిల్లా ఏర్పాటు చేసి నేటికి ఏడాది పూర్తైంది. వందేళ్లకు పైగా చారిత్రక నేపథ్యం కలిగి 57 మండలాలతో ఉన్న ఉమ్మడి గుంటూరు జిల్లాను మూడుగా విభజించి 28 మండలాలతో నరసరావుపేట కేంద్రంగా పల్నాడును ఏర్పాటు చేశారు. సీఎం ఆశయాల మేరకు పరిపాలన వికేంద్రీకరణ జరిగి ప్రజలకు పాలన చేరువైంది. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందుతున్నాయి. గ్రామ స్థాయి వరకు అధికారుల పర్యవేక్షణ సులభతరమైంది. దీంతో అన్ని వర్గాల నుంచి కొత్త జిల్లాల ఫలాలను అందుకుంటున్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం...

పల్నాడు ఏర్పడిన ఏప్రిల్ 4, 2022న జిల్లా కలెక్టర్‌గా శివశంకర్ లోతేటి, ఎస్పీగా వై.రవిశంకర్‌రెడ్డి, జేసీగా శ్యాంప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. కొత్త జిల్లా కేంద్రంలో అవసరమైన మౌలికవసతులు, అధికారులు, సిబ్బంది లేకపోయినా ఒక్కొక్కటిగా సమకూర్చుకుంటూ జిల్లా కార్యాలయాలను ఏర్పాటు చేశారు. అన్ని విభాగాలతో కలెక్టరేట్ పని చేసేలా కలెక్టర్ చొరవ చూపారు. స్పందన ద్వారా ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను తెలుసుకొని, వీలైనంత త్వరగా పరిష్కారం చూపారు. గతంలో ఏడాది కాలంలో జిల్లాలోని 57 మండలాలను తిరగడం కష్టంగా ఉండేది. నూతన జిల్లా ఏర్పడిన తరువాత కలెక్టర్ 28 మండలాలు, 8 మున్సిపాలటీలలో పర్యటించారు. ముఖ్యంగా సమీక్షల సమయంలో కలెక్టర్ నేరుగా అన్ని మండలాల పరిస్థితిని స్వయంగా అడిగి తెలుసుకొనే అవకాశం ఉండటంతో పనులు వేగవంతంగా పూర్తి అవుతున్నాయి. మరోవైపు గతంలో ఉన్న నరసరావుపేట, గురజాలకు తోడుగా సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయడంతో ప్రజలకు పాలన చేరువైంది.

వేగంగా అభివృద్ధి పనులు...

జిల్లా పరిధి తగ్గడంతో జిల్లాలోని అన్ని అభివృద్ధి పనులపై కలెక్టర్, ఇతర అధికారులు పర్యవేక్షణ పెరిగింది. పిడుగురాళ్ల మెడికల్ కళాశాల, జిల్లాలో వెళుతున్న నాలుగు జాతీయ రహదారుల భూసేకరణ, పరిశ్రమల ఏర్పాటు, పర్యటకాభివృద్ధికి ఎక్కువ సమయం కేటాయించే అవకాశముండటంతో ఆయా పనులు పురోగతిలో ఉన్నాయి. నవశకం, గ్రామోదయం, కాఫీ విత్ క్లాప్ మిత్ర, మిషన్ శోభకృత్ వంటి కార్యాక్రమాలతో ఇతర జిల్లాలకు పల్నాడు జిల్లా ఆదర్శంగా నిలుస్తోంది. ఏడాది కాలంలో బడికి దూరంగా ఉన్న సుమారు 8 వేల మంది పిల్లలను తిరిగి బడిలోకి చేర్పారు.

పల్నాడు జిల్లా స్వరూపం...

విస్తీర్ణం	7,031 చ.కిమీ.
రెవెన్యూ డివిజన్లు	3
మండలాలు	28
గ్రామ పంచాయతీలు	527
మున్సిపాలిటీలు	08
అసెంబ్లీ నియోజకవర్గాలు	07
పార్లమెంట్ నియోజకవర్గం	01
జనాభా	20.42 లక్షలు
పురుషులు	10.24 లక్షలు
మహిళలు	10.18 లక్షలు
పట్టణ జనాభా	4.59 లక్షలు
గ్రామీణ జనాభా	15.83 లక్షలు



పిడుగురాళ్ల కొండమోడు జంక్షన్‌సమీపంలో జరుగుతున్న బైపాస్‌రోడ్డు పనులు

నేడు ప్రథమ వార్షికోత్సవం

పల్నాడు జిల్లా ప్రథమ వార్షికోత్సవ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా వేడుకలు చేయడానికి అధికార యంత్రాంగం సిద్ధమైంది. మంగళవారం సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జిల్లా మంత్రుల మొదలు సర్పంచ్‌లు, సామాన్య ప్రజలు పాల్గొననున్నారు. ఇందులో భాగంగా పల్నాడు జిల్లా సంస్కృతి, భౌగికోళి పరిస్థితులు అద్దం పట్టేలా పైలాన్, చిహ్నంలను ఆవిష్కరించనున్నారు. కలెక్టరేట్‌లో కొత్త ఫుడ్ కోర్టును ప్రారంభించనున్నారు. నవోదయ లబ్ధిదారులకు కొత్త వాహనాల అందజేత, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఉద్యోగుల క్రీడల్లో గెలుపొందిన వారికి కలెక్టర్స్ ట్రోఫీ, ఉత్తమ ప్రదర్శన చూపిన ప్రభుత్వ కార్యాలయాలకు కలెక్టర్ అవార్డులు అందజేయనున్నారు.

దూరం తగ్గింది... భరోసా పెరిగింది



గతంలో వ్యక్తిగతంగా లేదా తండా పనులపై గుంటూరులోని జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే 150 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వచ్చేది. పల్నాడు ఏర్పడిన తర్వాత వంద కిలోమీటర్ల దూరంలోనే నరసరావుపేట ఉండటంతో సమయం ఆదా అవుతోంది. మరో వైపు గతంలో 57 మండలాలు ఉండటంతో అధికారులకు పని ఒత్తిడి ఉండటంతో మా సమస్యలు వినడం, పరిష్కరించడం కష్టంగా ఉండేది. ఇప్పుడు జిల్లా కార్యాలయాలు మా సమస్యలు సావధానంగా విని వెంటనే పరిష్కారం దొరుకుతోంది. కొత్త జిల్లా వల్ల మాచర్ల లాంటి దూరప్రాంత వాసులకు ఎంతో మేలు కలుగుతోంది.

– కేతావత్ శ్రీను నాయక్, సర్పంచి చింతల తండా, మాచర్ల మండలం

మరింత ఉత్సాహంతో పనిచేస్తాం



పల్నాడు జిల్లా ఏర్పడిన తర్వాత తొలి కలెక్టర్‌గా అవకాశం దక్కడం అదృష్టం. ఏడాది కాలంలో జిల్లాకు సంబంధించిన ప్రజాప్రతినిధులు, ఎస్పీ, జేసీ, ఇతర అధికారుల సహకారంతో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాం. కొత్త జిల్లాలో తొలి వసంతంలో జరిగిన మార్పులు ఎంతో సంతృప్తినిస్తున్నాయి. ఇదే ఉత్సాహంతో రానున్న కాలంలో మరింతంగా పనిచేస్తాం. రానున్న ఏడాది కాలంలో హౌసింగ్, జాతీయ రహదారులు భూసేకరణ, పర్యాటకాభివృద్ధి, రీసర్వే మొదలైన పనులపై ఎక్కువ దృష్టిపెట్టనున్నాం.

– శివశంకర్ లోతేటి, పల్నాడు జిల్లా కలెక్టర్

పల్నాడు జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు



పల్నాడు జిల్లా ప్రజలందరికీ పోలీస్‌శాఖ తరఫున శుభాకాంక్షలు. జిల్లా కేంద్రంగా నరసరావుపేట ఏర్పాటు చేసిన తరువాత ప్రజలకు అందుబాటులో పోలీస్ సేవలు ఉన్నాయి. శాంతి భద్రతలు సంబంధించి సమస్యలు తలెత్తలేదని వివరించారు. పల్లెనిద్రతో సమస్యలను కట్టడి చేశాం.

వై.రవిశంకర్ రెడ్డి, జిల్లా ఎస్పీ

మెరుగైన పోలీసింగ్..

ఒకప్పుడు పల్నాడు అంటే హడల్.. దాడులు ప్రతిదాడులు సర్వసాధారణం.. రాజకీయం ఒక పట్టనా అర్థం కాదు.. అలాంటి ప్రాంతానికి కొత్త జిల్లాల ఏర్పాటుతో దశ తిరిగింది.. యంత్రాంగం అందుబాటులోకి రావడంతో ఫ్యాక్షన్ గొడవలు కనిపించడం లేదు. నూతనంగా జిల్లా ఏర్పడిన తరువాత ప్రథమ ఎస్పీగా వై.రవిశంకర్ రెడ్డి బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక ఇంటర్వ్యూ..

- పల్నాడులో నేరాల సంఖ్య తగ్గుముఖం
- స్పందన ద్వారా ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్నాం
- సమస్యాత్మక గ్రామాల్లో పల్లె నిద్రతో సత్ఫలితాలు
- పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్ రెడ్డి



స్పందనలో బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి(ఫైల్)

సాక్షి, నరసరావుపేట: కొత్త జిల్లాలలో భాగంగా పల్నాడు జిల్లా ఏర్పడిన తర్వాత ఈ ప్రాంతంలో శాంతిభద్రతల పర్యవేక్షణ గతంతో పోల్చితే మరింత మెరుగ్గా ఉంది. ఏ ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొత్త జిల్లాలను ఏర్పాటు చేశారో ఆ ఫలాలు ప్రజలకు అందుతున్నాయి.. సున్నితమైన పల్నాడు ప్రాంత ప్రజలకు ప్రస్తుతం మెరుగైన పోలీస్ సేవలు అందుతున్నాయి.. ఏడాది కాలంలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గింది. నరసరావుపేట కేంద్రగా జిల్లా పోలీస్ కార్యాయలం పనిచేస్తుండటంతో ఎక్కడైనా చిన్న చిన్న అలజడులు చెలరేగినా వెంటనే స్పందించి శాంతిభద్రతలను అదుపులోకి తీసుకువస్తున్నామని పల్నాడు జిల్లా తొలి ఎస్పీ వై రవిశంకర్ రెడ్డి వివరించారు.

జీరో నుంచి ప్రారంభించాం

కొత్త జిల్లాగా ఏర్పాటైన తర్వాత గత ఏడాది ఏప్రిల్ 4న నరసరావుపేట జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చినప్పుడు పరిపాలనకు సరిపడా భవనాలు, వసతులు లేవు. తొలి రోజు నుంచే ఓ వైపు మెరుగైన పోలీసింగ్ అందిస్తూనే, జిల్లా కార్యాలయానికి మౌలిక వసతులను కల్పించడం ప్రారంభించాం. జీరో నుంచి ప్రారంభించి నేడు డీపీఓను ఓ ఉన్నంతలో మెరుగ్గా తీర్చిదిద్దుకున్నాం. అవసరమైన భవనాలు, రోడ్డులు ఏర్పాటు చేసుకున్నాం. డీపీఓలో పనిచేసే సిబ్బంది భోజనానికి ఇబ్బందిపడకూడదన్న ఉద్దేశంతో 'పోలీస్ క్యాంటీన్'ను ప్రారంభించాం. కేవలం రూ.40కే అందజేస్తున్నాం. వంటకు ఉపయోగించే కూరగాయలు, ఆకుకూరలను కార్యాలయ ప్రాంగణంలోనే సేంద్రియ పద్ధతిలో పెంచుతున్నాం. మరి ముఖ్యంగా బొల్లాపల్లి లాంటి మారుమూల ప్రాంతాల్లో ప్రజలు ఉచిత వైద్య సేవలు ఏర్పాటు చేయడం నాకు ఈ ఏడాది కాలంలో ఎంతో సంతృప్తినిచ్చింది. ఆ స్ఫూర్తితో బ్లడ్ బ్యాంక్ లాంటి మరిన్ని సేవా కార్యాక్రమాలు నిర్వహిస్తున్నాం.



జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

'స్పందన' సమస్యల పరిష్కారం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న 'స్పందన' కార్యక్రమం ద్వారా ప్రతి సోమవారం ప్రజల సమస్యలు విని పరిష్కారం చూపుతున్నాం. మాచర్ల, బొల్లాపల్లి లాంటి ప్రాంతాలు వారు గతంలో గుంటూరు వెళ్లడానికి ఇబ్బందిపడే వారు, ప్రస్తుత జిల్లా కేంద్రం నరసరావుపేట అన్ని ప్రాంతాల వారు రావడానికి అనువుగా ఉంది. స్పందనకు రాలేని వారి సమస్యలు విని పరిష్కరించేందుకు పల్నాడు జిల్లాలో వినూత్నంగా 'పల్లె నిద్ర' పేరిట కొత్త కార్యక్రమం అమలు చేస్తున్నాం. ఇందులో భాగంగా ఆయా స్టేషన్ల పరిధిలోని సమస్యాత్మక గ్రామాలు, వార్డులలో సీఐ, ఎస్‌ఐలు ప్రజలతో సమావేశాలు ఏర్పాటు చేసి సమస్యలు విని పరిష్కారం చూపుతున్నారు. పల్లె నిద్ర ద్వారా ముఖ్యంగా జరగబోయే నేరాలను ముందుగానే గుర్తించి, వాటిని అడ్డుకట్ట వేస్తున్నాం.

తగ్గిన నేరాలు

రెండేళ్లతో పోల్చితే ఈ ఏడాది కాలంలో పల్నాడు జిల్లాలో నేరాలు తగ్గుముఖం పట్టాయి. హత్యలు, నేరాలు, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలను బాగా కట్టడి చేశాం. కేసుల నమోదులో 34.05 శాతం తగ్గుదల నమోదైంది. రోడ్డు ప్రమాదాలు 11 శాతం తగ్గాయి. ఈఏడాది మరణాలు 13.5 శాతం తగ్గాయి. జిల్లాలో జరిగిన దొంగతనాల కేసుల్లో రికవరీ భారీగా పెరిగింది. 2020లో 54.9 శాతం, 2021లో 55.24 శాతం రికవరీ జరగగా ఈ ఏడాది 88.3 శాతంగా నమోదైంది. ప్రజలకు విరివిగా సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నాం. గంజాయి, గుట్కా, జూదం, క్రికెట్ బెట్టింగ్, నాటుసారాపై ఉక్కుపాదం మోపాం. ఈ ఏడాది 15 మందిపై పీడీ యాక్ట్ నమోదు చేశాం. నకిలీ సర్టిఫికెట్ల తయారీదారులను పట్టుకున్నాం. ఫోక్సో కేసుల్లో 60 రోజుల్లోపే చార్జిషీట్ దాఖలు చేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా ముఖ్యమైన ప్రదేశాల్లో విస్తృతంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, నిత్యం నిఘా పెంచడంతో నేరాలు అరికట్టగలుగుతున్నాం. చోరీకి గురైన 500కు పైగా బైక్‌లను రికవరీ చేయగలిగాం.

కోటప్పకొండ తిరునాళ్ల బందోబస్తు..

పల్నాడులో ఆధ్యాత్మికంగా ఎన్నో ప్రముఖ పుణ్య క్షేత్రాలు ఉన్నాయి. కోటప్పకొండ తిరునాళ్లను విజయవంతంగా పూర్తి చేయగలిగాం. గతంలో శివరాత్రి పండుగ రోజు రాత్రిపూట ట్రాఫిక్ జాం ఏర్పడి భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యేవారు. ఈ ఏడాది అలాంటి ఇబ్బందిలేకుండా ముందస్తు ప్రణాళిక, సిబ్బంది సహకారంతో కట్టడి చేశాం. ఇతర గ్రామాల్లో నిర్వహించే తిరునాళ్లను విజయవంతంగా పూర్తి చేయడంలో పోలీసులు కీలక పాత్ర పోషించారు. 100 కిలోమీటర్ల పైగా ఉన్న అంతరాష్ట్ర సరిహద్దు మీదుగా జరిగే అక్రమ రవాణాను అరికట్టగలిగాం. బల్లకట్టు, సాగర్‌లో పర్యాటక బోట్ల ప్రయాణాలపై తగిన జాగ్రత్తలు తీసుకున్నాం.

పల్నాడు జిల్లాకు ఐఎస్‌ఓ సర్టిఫికెట్

జిల్లా కలెక్టర్‌కు అందజేసిన సీఎం జగన్



తాడేపల్లిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నుంచి సర్టిఫికెట్ స్వీకరిస్తున్న కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: పల్నాడు జిల్లాకు ప్రతిష్టాత్మక ఐఎస్‌ఓ 9001:2015 గుర్తింపు లభించింది. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్‌కు ఐఎస్‌ఓ సర్టిఫికెట్ అందజేశారు. తొలి కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన శివశంకర్ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులకు జిల్లాకు ఈ గుర్తింపు లభించింది. మూడు రోజులుగా ఐఎస్‌ఓ సంస్థకు చెందిన కార్తికేయ అండ్ టీం కలెక్టరేట్లో పర్యటించింది. పలు రికార్డులను పరిశీలించింది. సిబ్బంది నిర్వహిస్తున్న రిజిస్టర్లు, జాబ్‌చార్ట్, హోదాలవారీగా ఉద్యోగస్తుల వివరాలు, ఎమర్జెన్సీ కాంటాక్ట్ నెంబరు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, కంప్లైంట్ బాక్స్, అత్యవసర అగ్నిమాపక పరికరాలు, పబ్లిక్ టాయిలెట్స్, స్పందన కార్యక్రమం నిర్వహణ, దానిపై ప్రతిస్పందన, పార్కింగ్ ప్లేస్, సీసీటీవీ మానిటరింగ్, వేస్ట్ మేనేజ్మెంట్, కంప్యూటర్ల నిర్వహణ, రిస్క్ అసెస్మెంట్ అనాలసిస్, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ ఆఫ్ ఆల్ డిపార్టుమెంట్స్, అదేవిధంగా అన్ని శాఖలు డాక్యుమెంట్లు, ఇంటర్నల్ రివ్యూ మీటింగ్ రివార్డ్ రికార్డులను తదితరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పరిశీలన అనంతరం కార్తికేయ బృందం కలెక్టర్‌ని కలసి అభినందిస్తూ ఐఎస్‌ఓ సర్టిఫికెట్‌కు సిఫార్సు చేశారు.

ప్రశాంతంగా ప్రారంభమైన పది పరీక్షలు

- జిల్లాలో 98.82శాతం హాజరు
- కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ శివశంకర్, జేసీ శ్యాంప్రసాద్



మున్సిపల్ బాలుర పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట ఈస్ట్: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు ఆయా పరీక్ష కేంద్రాల వద్దకు ఉదయం 8.30గంటలకే చేరుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. పట్టణంలోని మున్సిపల్ బాలుర, బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను కలెక్టర్ శివశంకర్ పరిశీలించారు. పరీక్ష గదులలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన వసతులు, వైద్య సేవా కేంద్రాలు, విద్యుత్ సదుపాయం, తాగునీరు తదితర ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని జేసీ ఏ శ్యామ్ ప్రసాద్ సందర్శించి వసతులపై ఆరా తీశారు. పిడుగురాళ్లలోని పరీక్ష కేంద్రాలను డీఈఓ కె.శామ్యూల్ తనిఖీ చేశారు.

తొలిరోజు 98.82 శాతం హాజరు

పదో తరగతి పరీక్షల తొలిరోజు తెలుగు పరీక్షకు 98.82 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ తెలిపారు. జిల్లాలోని 126 పరీక్ష కేంద్రాలలో 24,794 మంది విద్యార్థులకు గాను 24, 501 మంది హాజరైనట్లు చెప్పారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ హుసేన్ ఆధ్వర్యంలో కమాండ్ కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. పరీక్ష సమయంలో విచారణకు, ఫిర్యాదులకు, సమస్యల పరిష్కారానికి కమాండ్ కంట్రోల్‌రూం పనిచేస్తుందన్నారు. కంట్రోల్‌రూమ్‌కు 9441283674, 8341135357 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.6,000, గరిష్ట ధర రూ.8,100, మోడల్ ధర రూ.7,000 వరకు పలికింది.

స్పందన అర్జీలకు తక్షణమే పరిష్కారం



స్పందనలో సమస్య వింటున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: ప్రజల అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కార మార్గం చూపాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన కాన్ఫరెన్సు హాలులో స్పందన సోమవారం నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ శ్యామ్‌ప్రసాద్, డీఆర్‌ఓ కె.వినాయకంతో కలసి జిల్లా వ్యాప్తంగా ప్రజల నుంచి 110 అర్జీలు స్వీకరించారు.

- నూజెండ్ల మండలం ముత్తుజపురానికి చెందిన ఆలమంద అచ్చయ్య మరణ ధ్రువీకరణ పత్రం జారీలో పంచాయతీ సెక్రెటరీ స్పందించడం లేదని అర్జీ అందించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఆ ప్రాంత సచివాలయ పంచాయతీ సెక్రెటరీ చిట్టిబాబుకు తక్షణమే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్పందనకు వచ్చిన ఫిర్యాదుదారులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శాశ్వత సభ్యుడు, కడప జిల్లా పోరుమామిళ్లకు చెందిన మిత్తికెల శ్రీనివాసులు తన తండ్రి వెంకటసుబ్బయ్య పేరుతో ఉచిత భోజనం ఏర్పాటు చేశారు. అన్నదానం చేసిన దాతలను జిల్లా కలెక్టరేట్ ద్వారా సత్కరించారు.

ఉత్తమ ప్రదర్శనగా 'కాపల'

- ముగిసిన సుందరయ్య జాతీయస్థాయి నాటికల పోటీలు
- ద్వితీయ, తృతీయ ప్రదర్శనలుగా వెండి అంచులు, పక్కింటి మొగుడు


కాపల నాటిక బృందానికి ఉత్తమ బహుమతి అందజేస్తున్న అతిథులు

యడ్లపాడు: పుచ్చలపల్లి సుందరయ్య 20వ జాతీయస్థాయి తెలుగు సాంఘిక నాటికల పోటీలకు ఆదివారం రాత్రితో తెర పడింది. రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాకు చెందిన పరిషత్ నాటికలు ఈ పోటీల్లో ప్రదర్శించారు. స్థానిక ఎంవీ చౌదరి కళా వేదికపై పోటా పోటీగా తమ ప్రదర్శనలు నిర్వహించారు. ఆయా పోటీలకు ప్రధాన న్యాయనిర్ణేతలుగా బి.దాశరథి, ఆర్.భరద్వాజ, కె.శాంతారావు కాగా, వివిధ రంగాలకు చెందిన మరో 12 మంది వ్యవహరించడం విశేషం. నాటకరంగం అభివృద్ధికి అవిరళ కృషి చేస్తున్న కమిటీ సభ్యులు ముత్తవరపు సురేష్‌బాబు, పద్మారావు, నూతలపాటి కాళిదాసు, జరుగుల శంకరరావులను గ్రామస్థాయి నుంచి ఉమ్మడి తెలుగురాష్ట్రాల్లోని కళాసంస్థలు, కళాకారులు, ప్రముఖులు ప్రశంసించారు.

మూడు రోజుల్లో 9 నాటికలు..

మూడు రోజుల పోటీల్లో 9 నాటికలు ప్రదర్శించగా వాటిలో ఉత్తమంగా కాపలా నాటిక నిలిచింది. ఉత్తమ ద్వితీయ ప్రదర్శన వెండిఅంచులు నాటిక, ఉత్తమ తృతీయ ప్రదర్శన పక్కంటి మొగుడు నాటికలు బహుమతులు అందుకున్నాయి. ఆయా నాటికలకు వరుసగా రూ.25వేలు, రూ.22,500, రూ.20వేలు జ్ఞాపికలతో సత్కరించారు. ప్రతి ప్రదర్శనకు రూ.15వేలు, ప్రతి రచయిత, దర్శకుడికి, ఉత్తమ నటీనటులు, వివిధ కేటగిరీలకు ఒక్కొక్కరికీ రూ.1,116, ఉత్తమ సహాయ నటీనటులకు రూ.516 చొప్పున నగదు, జ్ఞాపిక అందించారు.

వ్యక్తిగత విభాగంలో..

ఉత్తమ రచయితగా యల్లప్రగడ భాస్కరరావు (కాపల), దర్శకుడు గంగోత్రిసాయి (వెండిఅంచులు), రంగాలంకరణ చైనత్య కళా స్రవంతి యూనిట్ (ఎస్–11), సంగీత దర్శకుడు కేటీడీ కార్తికేయ, ఆహార్యం ఎం.దినేష్‌బాబు (కపిరాజు), ఉత్తమ నటీమణులు అమృతవర్షిణి (ప్రక్షాళన), బి.వనిత (స్వీకారం), ఉత్తమ నటులు బి.చలం (కొత్తపరిమళం), పి.దివాకర్ ఫణీంద్ర (కపిరాజు), జి.కుసుమసాయి (కాపల), ఉత్తమ సహాయనటులు ఇ.పున్నయ్య చౌదరి (ప్రక్షాళన), ఉన్నం వెంకట శేషయ్య (పక్కింటి మొగుడు), వై.అనిల్‌కుమార్ (ఎస్–11) పీవీఆర్ మూర్తి (ప్రేమతో నాన్న), వసంతయామిని (వెండిఅంచులు) పొందారు.

సమస్యలకు చట్టపరిధిలో పరిష్కారం

- జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి
- స్పందనలో 58 ఫిర్యాదులు స్వీకరణ


బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరించి వారితో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: స్పందన ఫిర్యాదులను చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్ రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారిచే 58 ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు అడ్మిన్ ఎస్పీ జి.బిందుమాధవ్, డీఎస్పీలు సి.విజయభాస్కరరావు, యు.రవిచంద్ర, జి.జయరాంప్రసాద్, దిశా సీఐ సుభాషిణి, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కూలి అడిగినందుకు ఆటోను ధ్వంసం చేశారు..



చేసిన కూలీ పనులకు రావాల్సిన రూ.40వేలు డబ్బులు అడిగినందుకు కాంట్రాక్టర్ డబ్బులు ఇవ్వకపోగా నలుగురు వ్యక్తులను పంపించి నా ఆటోను ధ్వంసం చేశారు. నాపై దాడి చేశారు. నా భార్యతో అవమానకరంగా మాట్లాడారు. వారిపై చర్యలు తీసుకొని నా డబ్బులు నాకు ఇప్పించండి.

– మల్లెల దానియేలు, వడ్లమూడివారిపాలెం, రొంపిచర్ల మండలం

బంగారం చోరీ కేసు తేల్చండి..



2014 అక్టోబరులో మా షాపునకు కన్నం వేసిన ఓ దొంగ షాపులో బంగారం, నగదు సుమారుగా రూ.25లక్షలు విలువచేసేవి దొంగిలించాడు. దొంగనైతే అరెస్టు చేశారు. కానీ బంగారం మాత్రం ఇప్పటివరకు నాకు దక్కలేదు. అనేకమార్లు పోలీసు అధికారులను కలిశాను. బంగారం ఇప్పించి నాకు న్యాయంచేయండి.

– బొగ్గవరపు మణికంత, ఊటుకూరు, క్రోసూరు మండలం

బ్యాంకులో పెట్టిన ఉంగరం మాయమైంది



డబ్బుల అవసరం నిమిత్తం ప్రకాష్‌నగర్ యూనియన్ బ్యాంకులో పెట్టిన బంగారంలో నా ఉంగరం మాయమైంది. ఆ ఉంగరం వేరే ఫైనాన్స్ కంపెనీలో కన్పించింది. దీనికి అప్రైజరే కారణం. బ్యాంకు అధికారులను కోరినా స్పందించటం లేదు. నా ఉంగరం నాకు ఇప్పించగలరు.

– సూరే రత్తయ్య, నరసరావుపేట

పురుగు మందుల వ్యాపారి రూ.2.41కోట్లు మోసం చేశాడు..


ఫిర్యాదు చేసేందుకు వచ్చిన గురజాలకు చెందిన రైతులు

గురజాలకు చెందిన పురుగుమందుల వ్యాపారి సుమారు 75మంది రైతుల వద్ద నుంచి రూ.2.41కోట్లు వడ్డీకి తీసుకొని ప్రామిసరీ నోట్లురాసి రాత్రికి రాత్రే ఊరు నుంచి ఉడాయించాడు. అతనికి ఏదైనా హాని జరిగితే దానికి కారణం మీరేనంటూ మాకు తన న్యాయవాదితో నోటీసులు పంపాడు. అతడిని పట్టుకొని కనీసం మేమిచ్చిన అసలు డబ్బులైనా మాకు ఇప్పించండి.

– మండలపు వెంకటేశ్వర్లు, గూడూరి జగదీష్, లింగా నాగేశ్వరరావు, ద్రోణాదుల రాజేశ్వరి. రైతులు, గురజాల

అర్జీదారుల ఆకలి తీర్చడమే ధ్యేయం

అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి


కార్యక్రమాన్ని ప్రారంభించి, భోజనం వడ్డిస్తున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: సమస్యల పరిష్కారం కోసం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే స్పందనకు వచ్చే ప్రజల ఆకలి తీర్చడమే తమ ధ్యేయమని పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత భోజన సదుపాయాన్ని జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) జి.బిందుమాధవ్, దాతల సమక్షంలో రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రతి సోమవారం స్పందన కార్యక్రమానికి సమస్యలను విన్నవించి పరిష్కారం పొందేందుకు జిల్లాలోని వివిధ దూర ప్రాంతాల నుంచి ప్రజలు వస్తున్నారన్నారు. వారిలో వృద్ధులు, వివిధ అనారోగ్యాలతో ఉన్నవారు, పిల్లల తల్లులు ఉంటున్నారని, వారిలో కొంతమంది మధ్యాహ్న సమయంలో భోజనానికి ఇబ్బంది పడుతున్నట్లు తమ దష్టికి వచ్చిందన్నారు. వారి ఆకలి తీర్చేందుకు దాతల సహకారంతో వారికి భోజన సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇక నుంచి స్పందనకు వచ్చే ప్రజలు తప్పక ఈ భోజన సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు. ప్రజలకు ఉచిత భోజనం కల్పించేందుకు ముందుకు వచ్చిన దాతలైన పొడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, పాలువాది మధు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొత్తమాసు కిషోర్‌బాబు, వాసవి మిత్ర మండలి అధ్యక్షుడు చేగు వేంకటేశ్వరరావు, శ్రీ నరసరావుపేట కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పొన్నపాటి ఈశ్వరరెడ్డి, చిన్న కమ్యూనికేషన్స్ అధినేత చిన్ని శ్రీనివాసరావు మాజీ ఉపసర్పంచ్ పొన్నపాటి విజయభాస్కర్ రెడ్డి, డ్రగ్స్ వ్యాపారి ప్రవల్లిక సత్యంకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(ఏఆర్) రామచంద్రరాజు, ఏఆర్ డీఎస్పీ చిన్ని కృష్ణ, వెల్ఫేర్ ఆర్ఐ వెంకటరమణ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో దుర్గి బాలికకు కాంస్యం



విజేత నివేదితకు చెక్కును అందజేస్తున్న నిర్వాహకులు

దుర్గి: దుర్గికి చెందిన నివేదిత జాతీయస్థాయి ఖేలో ఇండియా వూషూ పోటీలలో కాంస్య పతకాన్ని సాధించింది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న నివేదిత గత మార్చి 27వ తేదీ నుంచి 31 వరకు జమ్మూ కశ్మీర్‌లో జరిగిన ఖేల్ ఇండియా వూషూ సబ్ జూనియర్ ఉమెన్స్ లీగ్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరపున పాల్గొంది. జియాన్‌షూ ఈవెంట్‌లో కాంస్యం సాధించింది. జాతీయస్థాయిలో తృతీయ స్థానంలో నిలిచిన నివేదిత దుర్గి జెడ్పీటీసీ సభ్యులు శెట్టిపల్లి యలమంద మనమరాలు కావడం విశేషం. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు నివేదితకు అభినందనలు తెలిపారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి



రెంటచింతల: మండలంలోని జెట్టిపాలెం గ్రామంలో సోమవారం సాయంత్రం పిడుగుపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన జరిగింది. వర్షంతోపాటు గాలి, ఉరుములు, మెరుపులు రావడంతో ఓ రైతు పొలంలో ఉన్న మిర్చి కల్లంపై పట్ట కప్పేందుకు గ్రామానికి చెందిన శీలం లక్ష్మయ్య(55) వెళ్లగా ఆ సమయంలో పిడుగుపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య మంగమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. లక్ష్మయ్య వ్యవసాయ కూలీగా జీవనం కొనసాగిస్తున్నాడు. మృతుని పూర్తి వివరాలను ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా పంపించినట్లు తహసీల్దార్ కట్టేకోట పుల్లారావు తెలిపారు.

ఏపీ క్రెడాయ్ చైర్మన్‌గా శివారెడ్డి ఎన్నిక అభినందనీయం

శివారెడ్డి సన్మాన సభలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



ఆళ్ల శివారెడ్డిని సన్మానించిన ఎమ్మెల్సీలు అప్పిరెడ్డి, ఏసురత్నం

పాత గుంటూరు: గత మూడు దశాబ్దాలుగా రియల్ ఎస్టేట్ రంగంలో నాణ్యమైన నిర్మాణాలు చేసి, వినియోగదారుల విశ్వాసం పొందిన ఆళ్ల శివారెడ్డి ఆంధ్రప్రదేశ్ క్రెడాయ్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికకావడం అభినందనీయమని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. ఇన్నర్ రింగు రోడ్డులోని శ్రీ కన్వెన్షన్ హాల్‌లో క్రెడాయ్ చైర్మన్ ఆళ్ల శివారెడ్డికి సన్మాన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. సభకు గుంటూరు క్రెడాయ్ చాప్టర్ ప్రెసిడెంట్ మామిడి రాము అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ క్రెడాయ్‌కు ప్రభుత్వ పరంగా సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ నిర్మాణరంగంలో అపారమైన అనుభవం కలిగిన శివారెడ్డి క్రెడాయ్ రాష్ట్ర చైర్మన్‌గా ఎన్నిక కావడం సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ అధికార ప్రతినిధి చందు సాంబశివరావు, రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ పి.రామచంద్ర రాజు, విశ్రాంత ఎస్పీ కోటేశ్వరరావు, బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి, డాక్టర్ శ్రీనివాస రెడ్డి, క్రెడాయ్ గుంటూరు చైర్మన్ ఆరుమళ్ల సతీష్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్లు మెట్టు సాంబశివారెడ్డి, డాక్టర్ డి. సురేష్‌బాబు, కార్యదర్శి తియ్యగూర వినోద్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి ఆళ్ల నాగార్జునరెడ్డి, రమాకాంత్, శివనాగేశ్వరరావు, కోశాధికారి మద్ది కార్తీక్, సభ్యులు పాల్గొని ఆళ్ల శివారెడ్డిని ఘనంగా సన్మానించారు. శివారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర క్రెడాయ్ చైర్మన్‌గా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వానికి, బిల్డర్లకు అనుసంధానంగా ఉండి భవన నిర్మాణరంగ అభివృద్ధికి పాటుపడతానని అన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన డీసీఎం వాహనం

ఎస్సెస్సీ బోర్డు సూపరింటెండెంట్ మృతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రోడ్డు ప్రమాదంలో ఎస్సెస్సీ బోర్డు సూపరింటెండెంట్ వీరవల్లి రత్నకుమారి(39) మృతి చెందిన ఘటన భవానీపురం గాలీ సాహెబ్ దర్గా సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిలకలూరిపేటకు చెందిన ఎస్. శ్రీనివాసరావు, వీరవల్లి రత్నకుమారి దంపతులు ఎస్సెస్సీ బోర్డు సూపరింటెండెంట్స్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం గొల్లపూడిలోని ఆంధ్ర హాస్పిటల్ ఎదురుగా ఉన్న అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. వీరి పెద్ద కుమార్తె పుష్పాంజలి వన్‌టౌన్ ఎట్కిన్ సన్ స్కూల్‌లో మూడో తరగతి చదువుతోంది. పాపను స్కూల్ నుంచి ఇంటికి తీసుకువచ్చేందుకు శ్రీనివాసరావు దంపతులు బైక్‌పై వన్‌టౌన్ బయలుదేరారు. భవానీపురం గాలిసాహెబ్ దర్గా దాటిన తర్వాత వెనుక వైపు నుంచి వేగంగా వచ్చిన డీసీఎం వాహనం బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్‌నడుపుతున్న శ్రీనివాసరావు ఎడమవైపుకు పడిపోగా , రత్నకుమారి కుడివైపు పడిపోయింది. డీసీఎం వాహనంవెనుక చక్రం ఆమె పై నుంచి వెళ్లింది.. విషయం తెలుసుకున్న ఎస్సెస్సీ బోర్డు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. 108 సిబ్బంది ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. స్వల్పంగా గాయపడిన శ్రీనివాసరావును ఆంధ్ర ఆస్పత్రిలో చేర్పించారు. దీనిపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

'పది' పరీక్ష కేంద్రాల్లో ఎస్పీ తనిఖీలు


ఉర్దూ హైస్కూల్‌ను తనిఖీ చేసి, వివరాలు తెలుసుకుంటున్న గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్

నగరంపాలెం: జిల్లాలో సోమవారం ప్రారంభమైన పదో తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లను జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ పరిశీలించారు. గుంటూరు నగరంలోని ఉర్దూ ఉన్నత పాఠశాల, హిందూ ఉన్నత పాఠశాల, మాజేటి గురవయ్య ఉన్నత పాఠశాలలో పర్యటించారు. ఆయా కేంద్రాలలో ఎంత మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు, వారికి కల్పించిన మౌలిక సౌకర్యాల ఏర్పాట్లపై ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. స్మార్ట్ వాచ్, మొబైల్ ఫోన్లు, ఐపాడ్ ఇతరత్రా ఎలక్ట్రానిక్ వస్తువులను లోనికి అనుమతించవద్దని ఎస్పీ సూచించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల అధికార, సిబ్బందికి సూచించారు. చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లతో మాట్లాడి, పలు సూచనలిచ్చారు. పరీక్ష వేళల్లో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అన్నారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలోని పదో తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టామని చెప్పారు. 144 సెక్షన్ అమలుతో పాటు, పరీక్ష కేంద్రాల దగ్గర్లో జిరాక్స్, ప్రింటింగ్ కేంద్రాలను మూసివేయించామన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ట్రాఫిక్ పోలీసులకు విధులు కేటాయించామని చెప్పారు. ప్రశ్న, సమాధాన పత్రాలు తరలించేందుకు ఎస్కార్ట్ ఉంటుందని, కొన్ని పరీక్షా కేంద్రాల వద్ద అదనపు పోలీస్ సిబ్బందికి విధులు కేటాయించాలని చెప్పారు. ఎవరైనా మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడినా, వారికి సహకరించిన చట్ట ప్రకారం చర్యలు తప్పవని అన్నారు. జిల్లాలోని ఏదైనా పరీక్ష కేంద్రం వద్ద చిన్న ఘటన జరిగిన డయల్ 100 లేదా జిల్లా పోలీస్ వాట్సాప్ నంబర్ 8688831568కు సమాచారం అందించాలని ఎస్పీ తెలిపారు. ఎస్పీ వెంట ఎస్‌బీ సీఐ బి.నరసింహారావు, కొత్తపేట పీఎస్, లాలాపేట పీఎస్, అరండల్‌పేట పీఎస్ సీఐలు శ్రీనివాసరెడ్డి, సుబ్బారావు, రామనాయక్ ఉన్నారు.

న్యాయవాదుల సంక్షేమానికి కృషి

జీబీఏ నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకారం


ప్రెసిడెంట్ కె.వి.కె.సురేష్, కార్యవర్గ సభ్యులు

గుంటూరు లీగల్: 2023- 24 సంవత్సరానికి జీబీఏ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. సోమవారం ప్రెసిడెంట్ కె.వి.కె.సురేష్‌తో పాటు వైఎస్ ప్రెసిడెంట్ దాసరి ఉమామహేశ్వరరావు, జనరల్ సెక్రటరీ నాగవంశీకృష్ణ, ట్రెజరర్ విజయ రాజకుమార్, లైబ్రరీ సెక్రటరీ గేరా శ్యాం రత్నరాజ్, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీ గాలి అశోక్ ఆనంద్, లేడీ ఎగ్జిక్యూటివ్ పర్చూరి కుమారి(నంద), సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు ఎం.ఆదిలక్ష్మి, జి.అనూరాధ, జి.విజయకుమార్, పి.బాబూరావు, జూనియర్ ఎగ్జిక్యూటివ్‌లు రాజేష్ లింగం పూడోట, శ్రీనివాసరావు రాయపూడి (గుండు శ్రీను), జి.లక్ష్మి అధికారిక నియామక పత్రాలు పొందడంతోపాటు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ కె.వి.కె.సురేష్ మాట్లాడుతూ తన గెలుపునకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. న్యాయవాదుల సంక్షేమానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

ట్రస్ట్ పేరుతో విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం

- ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగుల నుంచి డబ్బు వసూళ్లు
- పోలీస్‌స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు


ట్రస్ట్ వ్యవస్థాపకుడు మురళీకృష్ణ

మార్టూరు: అనాథలు, నిరుపేద విద్యార్థులే లక్ష్యంగా వారి భవిష్యత్‌తో చెలగాటం ఆడుతున్న ఓ మోసగాడి లీలలు బయటపడ్డాయి. ఈ విషయమై సోమవారం స్థానిక పోలీస్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. బాధితుల వివరాల మేరకు.. పర్చూరు మండలం నూతలపాడు గ్రామానికి చెందిన మురళీకృష్ణ స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గతేడాది తులసీ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ పేరుతో ఆఫీస్ ప్రారంభించాడు. కొంత కాలం తర్వాత మూసేశాడు. ఆ సమయంలో కరోనాతో మరణించిన వారి పిల్లలను, నిరుపేద విద్యార్థులను ఉచితంగా తమ ట్రస్ట్ ద్వారా ఇంజినీరింగ్ వంటి ఉన్నత విద్యను చదివిస్తామంటూ ఇంటర్ పాస్ అయిన విద్యార్థుల నుంచి ఒరిజినల్ సర్టిఫికెట్‌లు తీసుకున్నాడు. వీటి ద్వారా కొన్ని ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలలో ఉచిత విద్య అంటూ నమ్మించి, కాలేజీల్లో చేర్పించి యాజమాన్యాలు ఇచ్చే కమీషన్‌లు తీసుకొని పబ్బం గడుపుకున్నాడు.

ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని..

చీమకుర్తికి చెందిన మృదుల అనే విద్యార్థిని ఉచిత విద్య అంటూ గుంటూరు సమీపంలోని సెయింట్ మేరీస్ ఇంజినీరింగ్ కాలేజ్‌లో చేర్పించాడు. కానీ ఎటువంటి సాయం చేయలేదు. హాస్టల్ ఫీజుతోపాటు అన్ని ఫీజులు తానే చెల్లిస్తున్నానని, మురళీకృష్ణను నమ్మి మోసపోయానంటూ కన్నీటి పర్యంతమైంది. అదే మండలం కేవీ అగ్రహారానికి చెందిన హరితోటి త్రివేణి నుంచి 8 నెలల కిందట మురళీకృష్ణ 10వ తరగతి, ఇంటర్ ఒరిజనల్ సర్టిఫికెట్లు తీసుకొని ఇంత వరకు తిరిగి ఇవ్వలేదని, ఫోన్ చేస్తే సమాధానం చెప్పడని త్రివేణి సోదరుడు విలేకర్లతో వాపోయాడు. మార్టూరుకు చెందిన కే ప్రశాంత్ ఇంజినీరింగ్ పూర్తి చేయగా ఉద్యోగం ఇప్పిస్తానంటూ గత సెప్టెంబర్ 8వ తేదీన రూ.30 వేలు, 10వ తేదీన రూ.30 వేలు, మొత్తం రూ.60 వేలు గూగుల్ పే ద్వారా ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. ఉద్యోగం గురించి అడిగితే సమాధానం చెప్పడం లేదని బాధితుడు వాపోయాడు. సత్తెనపల్లికి చెందిన సీహెచ్ ధనుష్ రవికుమార్‌కు కూడా ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి గతేడాది ఆగస్టులో రూ.25 వేలు ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. ఈమేరకు సోమవారం స్థానిక పోలీస్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేయగా ఎస్సై కమలాకర్ దర్యాప్తు చేసి నిజానిజాలు తేల్చాలని ఏఎస్ఐ సైదాను ఆదేశించారు. మురళీకృష్ణ అరాచకాలపై దర్యాప్తు చేస్తే బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో అతని బారిన పడి మోసపోయిన అనేక మంది విద్యార్థులు, నిరుద్యోగుల వివరాలు తెలిసే అవకాశం ఉందని, తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా ఈ విషయమై మురళీకృష్ణను విలేకరులు వివరణ కోరగా తాను కొందరి నుంచి డబ్బు తీసుకున్న మాట నిజమేనని, అయితే ఉద్యోగం నిమిత్తం కాదని చెప్పడం గమనార్హం.